సాక్షి సూర్యాపేట

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



ఉన్నత ప్రమాణాలతో విద్య

ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్య అందించడమే తమ సంస్థ లక్ష్యమని డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	: 589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 24,357 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 45,107 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,279 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,791 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం: 642.50 అడుగులు

ఇన్‌ఫ్లో	: 642.50 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 624.52 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 259.38 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 306.54 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

న్యాయవాదుల విధుల బహిష్కరణ



సూర్యాపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు

చివ్వెంల (సూర్యాపేట) : కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది పి.సంతోష్ కుమార్ పట్ల పోలీసుల తీరును నిరసిస్తూ సోమవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. సూర్యాపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బార్‌అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడారు. న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలపురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి : వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాలబాలికలకు 2025 సంవత్సరంలో అందించనున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ కోసం ఆగస్టు 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లోని నేషనల్ అవార్డ్స్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని, ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు వంటి సేవా రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత ప్రతిని కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

ఇరుగుపొరుగు వారితో ప్రేమతో మెలగాలి



హుజూర్‌నగర్‌లో చర్చి వార్షికోత్సవంలో మాట్లాడుతున్న బిషప్ ధమన్ కుమార్

హుజూర్‌నగర్ : ప్రతి ఒక్కరూ ఇరుగుపొరుగు వారితో ప్రేమతో మెలగాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా బిషప్ ధమన్‌కుమార్ సూచించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చి వార్షికోత్సవాన్ని ఆయన హాజరైన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడ చూసినా స్వార్థం, హింసావాదం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హింసావాదం మనిషి పతనానికి దారితీస్తుందన్నారు. క్యాథలిక్ కుటుంబాలకు ఫీస్ట్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మరయ్య, సిస్టర్లు, వివిధ చర్చిల ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

- **రాఖీ రద్దీ**



రాఖీ పండుగ సందర్భంగా అర్వపల్లిలో బస్సు వద్ద కిటకిటలాడుతున్న ప్రయాణికులు

- **కలెక్టర్ సారూ.. మీరే రక్ష**



రక్షాబంధన్ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు రాఖీ కడుతున్న సూర్యాపేట పట్టణంలోని బాలసదనం చిన్నారులు

- **వృక్షాబంధన్..**



పెన్‌పహాడ్ మండలం అనంతారంలో వృక్షానికి రాఖీ కడుతున్న యువకులు

అంగన్‌వాడీలు బలోపేతం

- ఖాళీల భర్తీకి ప్రభుత్వం సన్నద్ధం
- వేకెన్సీ గుర్తించాలని సంక్షేమ అధికారులకు ఆదేశాలు
- గడువు 65 ఏళ్లు దాటితే రిటైర్మెంట్
- ఆ పోస్టులు కూడా నింపే యోచన
- నివేదిక పంపిన అధికారులు



భానుపురి (సూర్యాపేట) : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంపై సర్కారు దృష్టిసారించింది. కేవలం పౌష్టికాహారమే కాకుండా పూర్వ ప్రాథమిక విద్యను అందించేలా సిద్ధం చేయాలని భావిస్తోంది. ఆయా కేంద్రాల్లో పోస్టులను భర్తీ చేయాలని యోచిస్తోంది. ఈ మేరకు మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు. టీచర్లు, హెల్పర్ల ఖాళీలను గుర్తించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి జూలైలో అన్ని జిల్లాల సంక్షేమ అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఆయా ఖాళీలకు రోస్టర్ పాయింట్ కూడా నిర్ధారించాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టుల వివరాలతో కూడిన జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

ఐదు ప్రాజెక్టుల పరిధిలో..

సూర్యాపేట జిల్లాలో ఐదు ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో 1,209 అంగన్‌వాడీ సెంటర్లు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం పౌష్టికాహారమే కాకుండా ప్రీప్రైమరీ విద్యను అందించేలా బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ భర్తీ చేసే సమయంలో గతంలో ఉన్న మాదిరిగానే కాకుండా టీచర్లు, ఆయాల విద్యార్హతలను పెంచినట్లు తెలుస్తోంది. గతంలో టీచర్ పోస్టు భర్తీకి పదోతరగతి అర్హత కాగా.. ఆయా పోస్టులకు 4, 5వ తరగతి అర్హతగా ఉండేది. అయితే తాజాగా టీచర్‌తో పాటు ఆయా పోస్టులకు ఇంటర్ అర్హతగానే భర్తీ చేయనున్నారు.

అధికారులు గుర్తించిన ఖాళీలు ఇలా..

మొత్తం అంగన్‌వాడీకేంద్రాలు 1,209	
టీచర్ పోస్టులు	ఆయా పోస్టులు
61	200

ఖాళీలను గుర్తించాం

జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు గుర్తించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు భర్తీ ప్రక్రియ ఉంటుంది. ఖాళీల వివరాలను ఉన్నతాధికారులను అందించాం.

– నర్సింహారావు, ఐసీడీఎస్ పీడీ

లెక్కలు తేల్చిన అధికారులు

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల లెక్కలను అధికారులు తేల్చారు. ఇటీవల ప్రభుత్వం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ ప్రకటించింది. జూలై 1 నుంచి వారికి అటెంటెన్స్‌ను కూడా నిలిపివేసింది. దీంతో ఆయాలతో పాటు టీచర్ల పోస్టులు ఖాళీ అయ్యాయి. అలాగే సూపర్‌వైజర్ పోస్టుల భర్తీని పదోన్నతులతో చేపట్టడం, మినీ అంగన్‌వాడీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వివిధ కారణాలతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే వీటన్నింటినీ భర్తీ చేసి అంగన్‌వాడీల్లోనే పూర్వ ప్రాథమిక విద్య అందేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ప్రభుత్వ సూచనల మేరకు అధికారులు ఖాళీల వివరాలను సేకరించగా.. జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 61, ఆయా పోస్టులు 200 ఖాళీగా ఉన్నట్లు గుర్తించి జాబితాను ఉన్నతాధికారులు నివేదించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లా అధికారులు ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, క్లినికల్ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్‌ను విధిగా సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యాలయంలో సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలపై 5, డీఎంహెచ్‌ఓకు సంబంధించి ఒకటి, డీపీఓకు సంబంధించి 2, ఆర్ అండ్‌బీ- 1 ఇలా మొత్తం 13 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్స్ పద్మారావు, శ్రీలత, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, జెడ్పీ సీఈఓ అప్పారావు, స్త్రీ,శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీసీఓ పద్మ, సీపీఓ శంకర్ పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్

తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసా ఇవ్వడమే రాఖీ పండుగ విశిష్టత అని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలసదనం చిన్నారులు కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీక గా నిలుస్తుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను తమ సోదరీమణులుగా భావించి, అండగా ఉండాలని ఆయన కోరారు. అనంతరం పిల్లలను ఆశీర్వదించి మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ నరసింహారావు, డీసీపీయూ రవికుమార్, చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ మంగతాయి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మీరా, సాగర్, కవిత, సఫియా, పిల్లలు పూజ, అంజలి, ఆదిలక్ష్మి, వర్షిత, నవనీత, సౌమ్య, మదనశ్రీ, రేఖ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీక్రిష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో స్వామివారిని గరుడవాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

కనీస వేతనం రూ.24వేలు చెల్లించాలి

- గోపాలమిత్రల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

పెద్దవూర : పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు కనీసవేతనం రూ.24 వేలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్రల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా పెద్దవూరలో నిర్వహించిన గోపాలమిత్రల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నా రూ.8500 వేతనమే అందజేస్తున్నారని పేర్కొన్నారు. పశువైద్యశాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో సీనియారిటీ ప్రాతిపదికన గోపాలమిత్రలకు అవకాశం కల్పించాలని, వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షలో అర్హత కలిగిన గోపాలమిత్రలకు 30 శాతం వెయిటేజీ కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు ఇవ్వాలన్నారు.



పెద్దవూరలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు



తీజ్ సంబరం

సూర్యాపేట పట్టణంలోని 16వ వార్డులో సోమవారం నిర్వహించిన తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు

ఏ పంట.. ఎంత?

- క్షేత్రస్థాయిలో పంటల వివరాల సేకరణ
- సర్వే నంబర్ల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పటి వరకు 63.84శాతం పూర్తి
- నెలాఖరులోగా పూర్తి చేసేలా అధికారుల ప్రణాళిక



నాగారం : జిల్లాలో పంటల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మరం చేశారు. రైతులు ఏయే పంటలు పండిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు. అధికారులు వ్యసాయక్షేత్రాల్లోకి రైతులు ఎంత విసీర్ణంలో ఏయే పంటలు సాగు చేస్తున్నారనే సమాచారాన్ని సర్వే నంబర్ల వారీగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ జాబితా ఆధారంగానే అన్నదాతలకు రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. ఇప్పటి వరకు పంటల నమోదు ప్రక్రియ 63.84శాతంమేర పూర్తి అయ్యింది. ఈ నెలాఖరులోపు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇప్పటి వరకు తెలిసిన లెక్కల ప్రకారం జిల్లాలోఅత్యధికంగా వరి సాగు చేస్తుండగా ఆ తర్వాతిస్థానంలో పత్తి ఉంది.

ఆన్‌లైన్‌లో నమోదు ..

ఏటా సీజన్‌వారీగా పంటల సాగు వివరాలు నమోదు చేస్తున్నారు. గతంలో అధికారులు ఒకే చోట కూర్చొని కొందరు రైతుల నుంచి సేకరించేవారు. దీంతో సాగు లెక్కల్లో కొంత వ్యత్యాసం కనిపించేది. కానీ కొన్నాళ్లుగా పంటల వివరాలు పారదర్శంగా నమోదు చేస్తున్నారు. ప్రతి పంట క్షేత్రానికి అధికారులు వెళ్లి పట్టాదారు పాస్‌పుస్తకం, సర్వే నంబర్ల వారీగా ఏ రకమైన పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారనే విషయాలు సేకరిస్తున్నారు. అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో రెవెన్యూ గ్రామాల వారీగా ఎంత విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారో తేలనున్నాయి.

పకడ్బందీగా..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం 2,83,757 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటిలో ఎస్సారెస్పీ, జలాశయాలు, చెరువులు, కుంటల పరిధిలో 1,97,669 ఎకరాల్లో వరి, 77,794 ఎకరాల్లో పత్తి, 4,073 ఎకరాల్లో జీలుగ, 2,403 ఎకరాల్లో పెసర్లు, 1,410 ఎకరాల్లో కందులు, 251 ఎకరాల్లో వేరుశనగ, 157 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని అంచనా వేశారు. ఇప్పటి వరకు 1,81,167 ఎకరాల పంటల వివరాలను అంటే 63.84శాతం మేర వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 1,02,589 ఎకరాల పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సొమ్మును ఈ జాబితా ప్రకారమే విడుదల చేయనుంది. గత ప్రభుత్వం సాగు చేయని భూములకు రైతుబంధు డబ్బులు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం పకడ్బందీగా పంటల సర్వే చేపడుతోంది.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం



జిల్లాలో పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రం వద్దకు సిబ్బంది వెళ్తున్నారు. పంటల వివరాలు సేకరిస్తున్నారు. మండల, జిల్లా స్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈనెలాఖరులోపు సాగు వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తిగా నిక్షిప్తం కానున్నాయి. రైతు భరోసా, బీమా తదితర పథకాల అమలుకు ఈ జాబితానే కొలమానం.

– జి. శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, సూర్యాపేట

పంటల వివరాల నమోదు ఇలా...

ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రానికి వ్యవసాయ విస్తరణ అధికారులు వెళ్తున్నారు. అక్కడ ఆ రైతు ఏయే సర్వే నంబర్లలో ఏ పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, రైతు పేరు, ఊరు, భూమి, బోరు బావులా, సాగునీటి సౌకర్యం ఉందా అనే వివరాలను నమోదు చేస్తున్నారు. ట్యాబ్‌లో నమోదు చేసి ఫీల్డ్ నుంచే ఆన్‌లైన్‌లో ఫొటోలు తీసి రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. దీని ద్వారా పంటల దిగుబడి ఎంత వస్తుంది. మార్కెట్ సౌకర్యం వంటి వాటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడుతుంది.

అవినీతి ఉద్యోగులపై కొరడా

- సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్
- కోదాడ తహసీల్దార్ బదిలీ, ఆర్‌ఐ సస్పెన్షన్

కోదాడ : రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కోదాడ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్‌ను బదిలీ చేయడంతోపాటు ఆర్‌ఐని సస్పెండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారసత్వ భూమి భాగ పంపిణీ కోసం ఓ రైతు కుటుంబం నుంచి కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో రూ.1.50లక్షలను కిందిస్థాయి సిబ్బంది ద్వారా వసూలు చేయడంపై.. 'లక్షల్లో వసూలు చేశారు' అనే శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. దీనిపై కోదాడ ఆర్డీఓతో విచారణ చేయించారు. తహసీల్దార్ సాయిరాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సుజాతపై రైతుల నుంచి వచ్చిన పలు ఆరోపణలు వాస్తవమని విచారణలో తేలింది. దీంతో తహసీల్దార్ ను బదిలీ చేయడమే గాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

సీనియర్ అసిస్టెంట్..

సూర్యాపేట కలెక్టరేట్‌లోని పరిపాలనా విభాగంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న నాగారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షఫిపై రైతుల నుంచి పలు ఆరోపణలు రావడంతో విచారణ చేసి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టి అభిషేకం, అర్చన చేశారు.అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. అదే విధంగా యాదాద్రి కొండపై ప్రధానాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. వేడుకల్లో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

రాజాపేట: విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలైన ఘటన రాజాపేట మండల పరిధిలోని బంటుగూడెంలో సోమవారం జరిగింది. బంటుగూడెం గ్రామానికి చెందిన కర్రె లక్ష్మి, పాండవుల శారద తమ ఇళ్ల ముందు దండెంపై బట్టలు ఆరేస్తుండగా.. దండేనికి విద్యుత్ సరఫరా కావడంతో వారిద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. పక్కనే ఉన్న వ్యక్తి గమనించి కర్ర సహాయంతో తీగను తప్పించడంతో వారు కిందపడిపోయారు. లక్ష్మి, శారదకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

త్రిపురారం: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్య తండాలో జరిగింది. సోమవారం ఎస్ఐ వీరశేఖర తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామానికి చెందిన ముడావత్ బాలు(43) గత 20 ఏళ్లుగా మద్యానికి బానిసై పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆదివారం త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్యాతండాలో గల ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ఆలయంలో ఉండగా.. రాత్రి 10 గంటలకు బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ముడావత్ తరి ఆలయం బయటకు వెళ్లి వెతకగా.. గుడికి సమీపంలో చెట్టుకు తన లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

నేరేడుచర్ల : దొంగతనం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం మేదారం గ్రామానికి చెందిన అంతని గోపి అనంతగిరి మండలం శాంతినగర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2023 సెప్టెంబర్ 15న మేదారంలో నెమలితోక సొడమ్మ తనఇంట్లో నిద్రిస్తుండగా ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడును గోపి దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా 2022 మే 5వ తేదీన చిలుకూరు మండలం పోలేనిగూడెంలో ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారపు గొలుసును కూడా గోపి దొంగిలించాడు. తాను చోరీ చేసిన సొత్తును సోమవారం నేరేడుచర్లలో అమ్మేందుకు గోపి వెళ్తుండగా.. పోలీసులు పట్టుకుని అతడి వద్ద నుంచి రెండు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గోపిపై మునగాల, సూర్యాపేట, చివ్వెంల, మోతె, నడిగూడెం, చిలుకూరు, నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి



రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి హితాశ్రీ



రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరీమణి



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



'రాఖీ కట్టేందుకు ఆడపిల్లను కాపాడుకుందాం' అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మిర్యాలగూడ మండలం అవంతీపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి తన క్యాంపు కార్యాలయంలో రాఖీ కడుతున్న మహిళలు



సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్



భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్



నల్లగొండ నుంచి బస్సులో నిలబడి ప్రయాణిస్తున్న మహిళలు



నల్లగొండ బస్టాండ్‌లో టికెట్ కౌంటర్ వద్ద భారీ క్యూ



మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టి యాదాద్రి ప్రసాదం తినిపిస్తున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

కోదాడ: పట్టణ పరిధిలోని కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం తెల్లవారుజామున రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన గుడుగుంట్ల రామకృష్ణ(48) మందులు కొనుగోలు చేసేందుకు సోమవారం తెల్లవారుజామున బైక్‌పై ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా.. కూరగాయల మార్కెట్ వద్ద మరో బైక్‌పై ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి రామకృష్ణ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా.. అందులో ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ఎడమ కాల్వలో బాలిక గల్లంతు



తేజశ్రీ

వేములపల్లి: సాగర్ ఎడమ కాల్వలో బాలిక గల్లంతైంది. ఈ ఘటన సోమవారం వేములపల్లి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కుసుమవారిగూడెం గ్రామానికి చెందిన పోతురాజు విజయలక్ష్మి, సైదులు దంపతులకు కుమార్తె తేజశ్రీ (14), కుమారుడు గోపిచంద్ సంతానం. విజయలక్ష్మి తమ్ముడు కోదాడి పరుశురాములు వివాహానికి ఆరు రోజుల క్రితం కుటుంబ సభ్యులంతా కలిసి వేములపల్లి మండలం బుగ్గబావిగూడేనికి వచ్చారు. ఆదివారం వివాహం అయిపోగా సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎల్–14 వద్ద గల బట్టలు ఉతికేందుకు విజయలక్ష్మి, కుమార్తె తేజశ్రీ, కుమారుడు గోపిచంద్‌తో పాటు మరికొందరు బంధువులతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో తేజశ్రీ ఒక్కసారిగా కాలు జారి కాల్వలో పడిపోగా ప్రవాహానికి కొట్టుకుని పోయింది. తేజశ్రీని కాపాడేందుకు పలువురు ప్రయత్నించగా ప్రవాహ వేగానికి గల్లంతైంది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని తేజశ్రీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తేజశ్రీ పెన్‌పహాడ్ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అదుపుతప్పి పాల ట్యాంకర్ బోల్తా



చాసిస్ నుంచి విడిపోయిన ట్యాంకర్

పెద్దవూర: మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న పాల ట్యాంకర్ ఆదివారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బోల్తా పడింది. పెద్దవూర మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా.. ప్రధాన రహదారికి డైవర్షన్ ఏర్పాటు చేసి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అతివేగంగా వస్తున్న పాల ట్యాంకర్ డ్రైవర్ దగ్గరికి వరకు వచ్చాక రోడ్డు డైవర్షన్‌ను గమనించి వాహనాన్ని ఒక్కసారిగి పక్కకు తిప్పడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గాలిపంపును, మోటార్లను, డివైడర్లకు అమర్చిన ఇనుప గ్రిల్స్‌తో పాటు పక్కనే 33/11 కేవీ విద్యుత్ స్తంబాన్ని తాకుతూ వెళ్లి బోల్తాపడింది. దీంతో చాసిస్ నుంచి ట్యాంకర్ ఊడిపోయి సగానికి పైగా పాలు రోడ్డుపాలయ్యాయి. ఉదయం వేరే ట్యాంకర్‌ను తీసుకొచ్చి ట్యాంకర్‌లో మిగిలిన పాలను తీసుకెళ్లారు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

దొడ్డా నారాయణరావు సతీమణి మృతి



సక్కుబాయి (ఫైల్)

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి స్వాతంత్ర్య సమర యోధుడు దొడ్డా నారాయణరావు సతీమణి, సీపీఐ సీనియర్ నాయకురాలు సక్కుబాయి(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావెళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, ఉజ్జిని రత్నాకర్, గన్నా చంద్రశేఖర్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పార్టీ కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, నెల్లికంటి సత్యం, ప్రముఖ వైద్యుడు సుబ్బారావు, కాంగ్రెస్ నాయకుడు చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు సక్కుబాయి భౌతికకాయానికి నివాళులర్పించారు.

అనారోగ్యంతో బాధపడుతూ రైతు బలవన్మరణం



వెంకట్‌రెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగి రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం ఉదయం భూదాన్ పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారాల వెంకట్‌రెడ్డి (57)కి భార్య పద్మ, ఇద్దరు వివాహితులైన కుమారులు ఉన్నారు. వెంకట్‌రెడ్డి గ్రామంలో వ్యవసాయం చేస్తుండగా.. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వెంకట్‌రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ 4జీ గుళికలను నీటిలో కలుపుకొని తాగాడు. తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లిన భర్త ఉదయం 9 గంటలైనా రాకపోయేసరికి ఆందోళనతో భార్య పద్మ అతని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడు. దీంతో వారి బావి సమీపంలో ఉన్న రైతుకు ఫోన్‌చేసి విషయం చెప్పగా.. ఆయన వెళ్లి చూడగా వెంకట్‌రెడ్డి మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. మంచం పక్కనే గుళికల ప్యాకెట్, నీళ్ల ఉండటాన్ని గమనించిన సదరు రైతు వెంటనే వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డబ్బుతో మాయమై.. శవమై కనిపించాడు

- నెల్లికల్లు అటవీ ప్రాంతంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

నాగార్జునసాగర్, మిర్యాలగూడ అర్బన్: ఏటీఎంల్లో డిపాజిట్ చేయాల్సిన డబ్బు తీసుకుని కనిపించకుండా పోయిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగార్జునసాగర్ నియోజవర్గ పరిధిలోని నెల్లికల్లు అటవీ ప్రాంతంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. నాగార్జునసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పడగాల సుధాకర్ (38) కుటుంబంతో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. మిర్యాలగూడలోనే ఏటీఎంల్లో మనీ డిపాజిట్ చేసే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో క్యాష్ డిపాజిటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సుధాకర్ ఏటీఎంల్లో డిపాజిట్ చేయాల్సిన రూ.20లక్షలను క్యాష్ డిపాజిట్ చేయకుండా కనిపించకుండా పోయాడు. దీంతో సుధాకర్‌పై సదరు కంపెనీ నిర్వాహకులు ఈ నెల 13వ తేదీన మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కాగా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు అటవీ ప్రాంతంలో సుధాకర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం పశువుల కాపరి గమనించి నాగార్జునసాగర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రత్నకుమారి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఆలయానికి తాళం వేసి వెళ్లిన అర్చకులు సోమవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా చెన్నకేశ్వరస్వామి వెండి కన్ను ఒకటి, నాలుగు చీరలు, వన్ గ్రాం గోల్డ్ వడ్డాణం, హుండీలో ఉన్న సుమారు రూ.15వేలు కనిపించలేదు. దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు మనీష్ గౌతమ్ మిర్యాలగూగ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అదేవిధంగా పక్కనే ఉన్న శివాలయంలో కూడా దుండగులు చోరీకి యత్నించారు. రెండు నెలల క్రితం ఇదే ఆలయంలో దుండగులు 22 కేజీల ఇత్తడి గంట ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.



స్వామివారి వెండి కన్ను ఎత్తుకెళ్లిన దుండగులు

ఈదురుగాలులకు కుప్పకూలిన కోళ్ల షెడ్డు

- ఐదువేల కోడిపిల్లలు మృతి
- యజమానికి తీవ్ర గాయాలు

గుర్రంపోడు: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పిట్టలగూడెం గ్రామంలో రామసాని నరేందర్‌రెడ్డికి చెందిన కోళ్ల షెడ్డు కుప్పకూలింది. ఆ సమయంలో షెడ్డులోనే ఉన్న నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే మరో షెడ్డులో ఉన్న అతడి కుటుంబ సభ్యులు గ్రామస్తులకు సమాచారం అందించగా.. వారు వచ్చి శిథిలాల నుంచి నరేందర్‌రెడ్డిని బయటకు తీసుకొచ్చారు. ఆయనను హుటాహుటిన నల్లగొండలోని ఆస్పత్రికి తరలించారు. షెడ్డు కుప్పకూలడంతో ఐదు వేల కోడిపిల్లలు మృతి చెందినట్లు భావిస్తున్నారు. అదేవిధంగా పిట్టలగూడెం, కొప్పోలు, గుర్రంపోడు, చామలోనిబావి, వట్టికోడు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో పాటు ఈదురుగాలులకు రోడ్లపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఊడిపోయిన బస్సు గేర్ రాడ్డు

చండూరు: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు గేర్ రాడ్డు ఒక్కసారిగా ఊడిపోయింది. సోమవారం మాల్ నుంచి నల్లగొండకు వస్తున్న ఆర్టీసీ బస్సు చండూరు మున్సిపల్ కేంద్రానికి చేరుకోగానే డ్రైవర్ గేర్ వేసేందుకు ప్రయత్నించగా గేర్ రాడ్డు చేతికి ఊడి వచ్చింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ప్రయాణికులు మరో బస్సులో ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.



చండూరులో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు